# కాకిగోల



తుది శ్వాస వదిలేటప్పుడు ఎవరైనా వచ్చి 'ఈ జన్మలో నువ్వుచేసిన ఒక మంచిపనిచెప్పు! అని అడిగితే– ఏ పార్టీకీ ఓటు వెయ్యకపోవడమే నేను చేసిన మంచి పని' అని చెప్పాలని నిర్ణయించుకొన్నాను.

నా నిర్ణయం బయటపడితే నన్నొక దేశద్రోహిగా పరిగణించవచ్చు. చట్టరీత్యా ప్రాసిక్యూట్ చేయించవచ్చు. నా యీ నిర్ణయం నలుగురికీ ఆమోదయోగ్యం కాకపోవచ్చు. కానీ నా నిర్ణయం మాత్రం ఇదే! ఎందుకంటే?– అది చెప్పడానికే కదా కథగా ప్రాణం పోసుకొన్న ఈ అనుభవం!

నేను పుట్టిన పది సంవత్సరాలకు దేశానికి స్వాతంత్ర్యం వచ్చింది.

స్వాతంత్ర్యం వచ్చిన పదేండ్లకు నాకు ఓటు హక్కు వచ్చింది. నాకు ఓటు హక్కు వచ్చిన నాటినుండి జరుగుతున్న ఎన్నికల జాతర చూస్తూనే ఉన్నాను. ఆ జాతర్లలో పేలే నాటు బాంబులు...తెగే తలకాయలు... పారేనెత్తురు.... చేతులు మారే నోట్లు... మూతులు నాకించే సారా పొట్లాలు... తెలిసీ తెలియనట్లుగా తెరవెనుక సాగిపోతుంటే తెరముందు ప్రచారాలు... వాగ్దానాలు... నమస్కార బాణాలు... చేతులు కాదంటూ చేతులే పట్టుకొని ప్రాధేయపడడాలు

ఒక్కటేమిటి?– కుర్చీ సాధనలో వ్యక్తిత్వం ఎన్ని తప్పుడు కూళ్ళు కుదుస్తున్నది– అన్నీ గమనిస్తూనే ఉన్నాను. ఏ పార్టీవాళ్ళు వచ్చినా చేతులు పట్టుకొనే అవకాశం ఇవ్వకుండా వాళ్ళచేతులే పట్టుకొని 'అయ్యయ్యో! మీరు ఇంతగా అడగాలా? ఆ మాత్రం నాకు తెలియదా? నా ఓటు తప్పకుండా మన పార్టీకే!' అంటూ అపద్ధానికి అందాలు సమకూర్చి నమ్మిస్తున్నాను.

ఈ అందమైన అపద్ధం దాదాపు మూడు దశాబ్దాలకు పైగా చలామణి అవుతూనే ఉంది. ఎన్నికలబరిలో మీసం మెలేసి దిగిన బడాబడానాయకులంతా నామాట నమ్ముతూనే ఉన్నారు. నమ్మకేంచేస్తారు? ఉత్తుత్త మాటల్తోనే ప్రజలను నమ్మిస్తున్నవాళ్ళు ఉత్తుత్త మాటల్ని కాదనలేరు కదా?

నేను అపద్ధాలు చెప్తూనే ఉంటాను. నాయకులంతా నమ్ముతూనే ఉంటారు. ఎన్నికల జాతరలు వస్తూనే ఉంటాయి. వచ్చినట్లు పోతూనే ఉంటాయి. ఈ జీవితం ఇలానే గడిచిపోతుంది. నా నిర్ణయం నిర్ణయంగానే మిగిలిపోతుంది. అప్పుడు ఆ అంతిమ దశలో ఎవడైనా వచ్చి 'చెప్పు. నిజంచెప్పు. ఈ జన్మలో నువ్వు చేసిన ఒక మంచి పని చెప్పు!' అని అడిగితే– 'ఓటు వెయ్యనని ఒట్టేసుకోవడమే నేను చేసిన మంచిపని' అంటూ గుండెమీద చెయ్యివేసి గుండె ఆగిపోకముందే చెప్తానన్న ధైర్యంతోనే ముందుకు సాగిపోతున్నాను.

అగ్గిపెట్టె తయారీనుండి అణుశాస్త్ర విధానం వరకు రాజకీయంతో ముడిపడినరోజులివి. ఈ రోజుల్లో రాజకీయ ప్రమేయం లేకుండా జీవితం గడపటం సాధ్యమా? అంటే– సాధ్యమే అనుకొన్నాను. కారణం నాది పరిమిత కుటుంబం. అంతకంటే నా అవసరాలు పరిమితం!

మేము ఇద్దరం. మాకు ఇద్దరే!

అబ్బాయి తెలివైన వాడు. ఏ తరగతిలో అయినా మొదటి శ్రేణిలో మొదటివాడు. వాడికొక ఉద్యోగం. అమ్మాయికి ముక్కూమూతి చక్కగా అమరడం అదృష్టం. ఆ అమ్మాయిని ఒకడి చేతిలో పెట్టడం కష్టసాధ్యం కాదనుకొన్నాను.

అక్కడే నేను పప్పులో కాలేసింది!

కడుపు పట్టిన బిడ్డ అయ్యో! ఇల్లు పట్టకుండా పోతున్నదని ఇళ్లిల్లు తిరగవలసిన అవసరం లేకపోయింది. నా ప్రయత్నమే లేదు. కట్నాలు కానుకల ప్రసక్తే లేదు. అమ్మాయికి సరితగ్గ అందగాడు. బాగా చదువుకొన్నవాడు. నాలుగు అంకెల జీతగాడు. వెదుక్కొంటూ వచ్చాడు. వెదకబోయిన లత చేతికి దొరికిందని ముచ్చటపడ్డాను. మూడుముళ్ళూ వేశాడు.

పదిమందికి నువ్వు చేసిన సహాయమే నిన్నిలా ఆదుకొనిందన్నారు పదిమందీ!

అమ్మాయి అదృష్టమన్నారు అయినవాళ్ళు కానివాళ్ళూ కూడా!!

అంతవరకు బాగానే ఉంది. కానీ అబ్బాయిదే సమస్యగా పరిణమించింది.

ఎన్ని చదువులు చదివినా.... ఎన్ని పోటీపరీక్షల్లో నెగ్గినా ఇంటర్వ్యూలో వాణ్ణి ఇంటిదారి పట్టిస్తున్నారు. వాడు ఇంటికి వచ్చి తల్లిని ఒకఆట పట్టిస్తున్నాడు. దాంతో గోకుడుపై మూకుడు ప్రతినిత్యం పెట్టి మూయలేనిదిగా నన్ను సతాయిస్తూనే ఉంది. ఉద్యోగాలు ప్రతిభతోకాకుండా రాజకీయంతో ముడిపడిన రోజులు. ఇప్పుడు రాజకీయాన్ని గురించి ఆలోచించమంటే చేతులు కాలిన తర్వాత ఆకులు పట్టుకోవడమే!

అయినా తప్పేటట్లుగా లేదు.

సరిగ్గా అదే సమయంలో నన్ను వెదుక్కొంటూ వచ్చాడొక వ్యక్తి!

"మిమ్మల్ని గురించి విన్నాను.పదిమందిలో మీకున్న పలుకుబడి తెలుసుకొన్నాను. ప్రతిఫలాపేక్ష కోరకుండా పదిమందికి చేతనయినంత చేయడమే మీ లక్ష్యమని నలుగురు చెప్పగా విని ఉప్పొంగిపోయాను. అటువంటి మంచివ్యక్తి అండదండలు ఏ వ్యక్తికైనా కొండంతలని భావించాను. మీతో సంప్రదించి మీ సమ్మతితో రానున్న ఎన్నికల్లో పోటీ చేయాలని సంకల్పం. సంకల్పం నాది. సహకార బలం మీది. మీ కలము గళము కూడా నాకు అవసరం. మీ ఋణాన పోను."

నాలుగే నాలుగు మాటలు!

నన్ను మాట్లాడనివ్వకుండా మాట్లాడాడు.

అదే నిజమైన రాజకీయ నాయకుని లక్షణం!

అతని మాట తీరు నచ్చింది. అతని వినయము విధేయత అతనికి రూపానికి ఒప్పింది. రాజకీయాల్లో అతడు బ్రహ్మాండంగా రాణించగలడన్న నమ్మకం కుదిరింది.

సరే! అనక తప్పలేదు.

అవసరం ఒక మనిషిని ఎంత హీనస్థితికైనా దిగజారుస్తుందనడానికి ఇది ఒక నిదర్శనం. నా నిర్ణయం గంగపాలయింది. నా ఓటు వెయ్యడమేకాదు. అహోరాత్రులు అతని వెంటపడి తిరిగి... రాయగలిగినంత రాసి.... చెప్పగలిగినంత చెప్పి నా మాట కాపాడుకొన్నాను.

అతడు గొప్ప మెజారిటీతో గెలిచాడు!

మోయలేనంత దండకాదు కానీ ఒకమోస్తరు గులాబీల దండ స్వయంగా అతని మెడలో వేసి కౌగలించుకొన్నాను.

కృతజ్ఞతాభావం కన్నుల్లో కరిగి ముత్యాలై నేను వేసిన గులాబీల దండలో మిలమిలా మెరిశాయి!

ఇనుమును బాగా కరిగినపుడే కొట్టాలి. మనిషి స్పందించినపుడే పనులు చక్కబెట్టుకోవాలి. ఏ మనిషికైనా అనుభవం గురువై నేర్పే పాఠం ఇది. అందుకే అన్నాను–

"మీరు నన్ను వెదుక్కుంటూ వచ్చారు. నా సహాయాన్ని కోరారు. ఉడతాభక్తే అనుకోండి. నావంతుపని నేను మనస్ఫూర్తిగా చేశాను. గొప్ప మెజారిటీతో మీరు గెలిచారు. మీకు రాజకీయంలో ఉజ్జ్వలమైన భవిష్యత్తు ఉందని నేనేనాడో గ్రహించాను. మీ నుండి నేనేమీ కోరడంలేదు. ఒక్కగా నొక్క బిడ్డ. వాడేమీ చెల్లని కాసు కాదు. వాడికొక బతుకు తెరువు.."

"మీరు చేసిన సహాయానికి నెత్తిన వేసుకొన్న శ్రమకు మీ కొడుకుకొక ఉద్యోగమే కాదు. నేను చేయవలసింది చాలా ఉంది. మీరు ఢిల్లీకి రండి. అక్కడే కూర్చోండి. మీ పని పూర్తి చేసుకొన్న తర్వాతే తిరుగు ప్రయాణం కట్టండి!" కృతజ్ఞతాభావం కూని రాగమై జోలపాటగా జోకొడ్తే నేను పరవశించిపోయాను. అప్పుడు అతని చేయి నా చేతుల్లో ఉంది– చేతిలో చెయ్యేసి చెప్పినట్లుగా!

నిజంగా ఆరోజే నా కొడుకు ఒక గెజిటెడ్ ఆఫీసరైనట్లు సంబరపడ్డాను!

నేను ఢిల్లీ ప్రయాణానికి సన్నాహాలు చేసుకొంటూనే ఉన్నాను. ఆలోపుగా అతడు ఢిల్లీలో కూర్చొని ఏ సన్నాహాలు చేసుకొన్నాడో- పత్రికల్లో వార్త. అతడు మంత్రి అయ్యాడు.

ఓయబ్బో! నాకుశాలకు కుచ్చుల కుళ్ళాయి ఒక్కటే తక్కువయింది!

కనిపించిన వాడంతా రెండు చేతులెత్తి దణ్ణం పెడుతున్నాడు. ఎత్తినచేతులు దించకుండా ఏకధాటిగా అభినందిస్తున్నాడు. నా ఇంటికి రాకపోకలు ఎక్కువయ్యాయి. పరిచయస్తులూ మరీ అప్తులైతే- "రొట్టె విరిగి నేతిలో పడడమంటే ఇదేనయ్యా. ఇదంతా! కొందరి చేతి వాసి. ఏది ఏమైనా మమ్మల్ని మాత్రం మరిచిపోవద్దు. ఒక కంట కనిపెడ్తూ ఉండు. పాత తంగేడు పువ్వయినా పండగపూట పనికివస్తుందిలే!" అంటూ వాడివేడి వాగ్బాణాలు సంధించి వదులుతున్నారు.

చూస్తూచూస్తూ ఉండగానే నాయింట్లో.... నావీధిలో.... కడకు నా ఊళ్ళో నా స్థాయి పెరిగిపోయింది. కలలో కూడా ఎదురుచూడని మన్ననలు మర్యాదలు గమనిస్తూంటే "నేనే మంత్రి అయ్యానేమో?' అన్న భ్రమ. అది ఒక చిత్రమైన భ్రమ. ఆ భ్రమలో ఊహలకు రెక్కలు వస్తాయి. అది నన్ను కూర్చోనివ్వడంలేదు. నిలబడనివ్వడం లేదు. ఎప్పుడెప్పుడు ఢిల్లీ వెళ్దామా? అతనితో కలిసి ఆనందాన్ని పాలు పంచుకొందామా? ఆ ఆనందంలో మన పని సానుకూలం చేసుకొందామా? అన్న ఆతురత కాదు. స్వార్థం.

ఆ ఆతురత నా ఢిల్లీ ప్రయాణానికి మరింత ఊపు నిచ్చింది.

ఢిల్లీ ప్రయాణమంటే మాటలా? జిల్లాకే ఎల్లలు ఎరగని వాణ్ణి. జిల్లాలు కాదు రాష్ట్రాలు దాటి ప్రయాణం చెయ్యాలి. ఎప్పుడూ ఎక్కని వాడు గుర్రమెక్కితే వెనకో ముందో అన్నట్లు అలవాటు లేని ప్రయాణం. లోబెరుకు వెలిబెరుగ్గానే ఉంది. అయినా అవసరం.

తిథి నక్షత్రాలు గణించి నా జన్మ నక్షత్రంతో గుణించి ప్రయాణానికి లగ్నం పెట్టించాను. బయలుదేరేటప్పుడు మా శ్రీమతిని ఎదురుగా రమ్మని ఆ లగ్నానికే బయలుదేరాను. రైలెక్కాను. ఆ రైలు పెట్టెలో ఆ సీటుకు చేరగిలబడి దాదాపు ముప్పైఆరుగంటల ప్రయాణం. ఎలా గడపాలో ఏమో? అని ఆలోచిస్తూ కూర్చున్నాను. రైలు కూతవేసింది. కదిలింది. అప్పుడు పరుగుల మీదవచ్చి అదేపెట్టెలో ఎక్కాడు సీతారాం- వాడే, నా చిన్ననాటి మిత్రుడు. చిరునవ్వుల పలకరింపుల తర్వాత తెలిసింది- అతడు కూడా ఢిల్లీకేనట.

నా పిరికి గుండె కౌగిలించుకొన్న ఎన్నో సందేహాలకు తాను పరిష్కారమైతే నా మనసు కొంత కుదుటపడింది.

సీతారాం ఊళ్ళు తిరిగిన కోడి. కోళ్ళను గెలిచిన కోడి. వాడికి నా మనసు తెలుసు. నా మంచితనం తెలుసు. పదిమందిలో కల పలుకుబడీ తెలుసు. అయితే నాది ఇంట గెలుపే కానీ రచ్చగెలుపు కాదని కూడా తెలుసు. ఆవులిస్తే పేగులు లెక్కబెట్టే మొగలాయికి నా అవస్థను గ్రహించడం అసలు సమస్యేకాదు. అందుకే పక్కన కూర్చున్నాడు. ఇలాంటి దూర ప్రయాణాల్లో ఖర్చును షేర్ చేసుకోవడంలో గల సౌలభ్యం మీద ఒక చిన్న ఉపన్యాసం దంచాడు. ఖర్చంతా ఒకరి చేతుల మీదుగా జరిగి ఆ తర్వాత సమభాగాలుగా భరించడంలో గల లాభాన్ని లెక్కగట్టి

చూపాడు. లాభసొలభ్యాల మాట దేవుడెరుగు. మనమాట మనమనసు తెలిసినమనిషి నీడలా ఒకడు తోడున్నాడు కదా అని సీతారాం చెప్పినదానికంతా నేను గంగిరెద్దులా తలాడించాను.

ఫలితంగా ఢిల్లీ మహానగరంలో ఒక పెద్ద హోటల్లోని చిన్న గదిలో సీతారం మంచం పక్కన నేలమీద అదనపు పడకకు నన్ను నేను అంకితం చేసుకొన్నాను.

అప్పటికీ పాపం సీతారాం అడగనే అడిగాడు కావాలంటే మీరు మంచం మీదనే పడుకోండి అని. ఆకలి రుచి ఎరుగదు. నిద్ర చోటెరుగదని చెప్పడంకాదు. అనుభవంతో గ్రహించిన వాణ్ణి. 'వద్దు వద్దండీ! మంచంమీదకంటే నాకు నేలమీదనే హాయిగా ఉంటుంది' అని ఒక చిన్న అపద్ధంతో నా మొగాన వెర్రి నవ్వులు పూయించాను.

ముక్తే ధ్యేయంగా నైరాశ్యం అంచున నిల్చినవాడు అష్టకష్టాలను ఆనందంగా భరిస్తాడట! అప్పటి నా ధ్యేయం మంత్రిగారిని కలుసుకోవడం. అటువంటప్పుడు పెద్ద హోటలు... చిన్నగది.... మంచం... నేల... తిండీ తిప్పలు వగైరా వగైరా చిన్న చిన్న విషయాల మీద ఆలోచించనే కూడదు. అసలు రాకూడదు.

ఆ రాత్రి ఊహల ఒడిలో మత్తుగా పడుకొని ఆలోచించకూడదనుకొంటూనే ఆలోచించాను.

ఊహల కౌగిట్లో కాలం ఆత్మార్పణ చేసుకొనింది.

తెల్లారింది. నా బతుకెలా తెల్లారుతుందో కానీ ఢిల్లీలో తెల్లారడం మాత్రం చాలా చిత్రంగా ఉంది. ఎంత ఆలస్యంగా పొద్దు మునిగిందో అంత ఆలస్యంగా పొద్దు మొలిచింది.

అంతవరకు ఎప్పుడు ఢిల్లీ చేరుకుంటామో? ఎక్కడ ఉంటామో? అక్కడ వసతి ఎలా ఉంటుందో? తిండీ తిప్పలెలా ఉంటాయో? అని నన్ను ముండ్ల మీద నిలబెట్టిన ఆలోచనలకు సీతారాం పుణ్యమా అని ఏదో ఒకరకంగా పరిష్కారం దొరికింది.

ఇక మిగిలింది ఒక్కటే పరిష్కారం. అది నా ఢిల్లీ ప్రయాణానికి సంబంధించిన వ్యవహారం. మంత్రిగారిని కలుసుకోవడం.

"ఫోన్ నంబరుంది కదా? ఇంకెందుకు భయం?" అని ఒకవైపు సీతారాం ధైర్యం చెప్తున్నా నా సందేహం సందేహమే! రాజకీయ నాయకులతో స్వయంగా అనుభవాలు లేకపోయినా చెవులున్నవాణ్ణికదా?

సరే! ఫోన్లమీద ప్రయత్నాలు... మన భాష వాళ్ళకు... వాళ్ళ భాష మనకు అర్థం కాని ఏడుపులు... అర్థమై ఏడ్చినా "ఇంకా నిద్రలేవలేదు. ఇప్పుడే స్నానికి వెళ్ళారు. పూజలో ఉన్నారు. అర్ధగంట ఆగి ఫోన్ చెయ్యండి" అన్న సమాధానాలు...అర్ధగంటకు అయిదు నిముషాలు ముందుగానే ఫోన్‌చేస్తే అయిదు నిముషాలకు ముందే వెళ్ళిపోయాడని చల్లగా చావు కబురు!

దినగండం నూరేండ్లయుస్సుగా ఈ తంతు రెండు దినాలు కొనసాగింది. జేబు బరువు తగ్గుతూ గుండె బరువు హెచ్చుతూ ఉంది. మంత్రిగారిని కలుసుకుంటామన్న నమ్మకం క్షణక్షణానికి సన్నగిల్లుతూ ఉంది. క్షణం తీరిక లేకుండా సీతారం తన పనులమీద తిరుగుతున్నాడు. క్షణమొక యుగంగా ఒంటరిగా సింగిల్ రూంలో చిత్రహింస. ఏమీ తోచకుండా

చూపు గోళ్ళమీదికి మళ్ళితే నఖహింస. సరిగ్గా అటువంటి సమయంలోనే ఫోన్ మోగింది. అందుకొన్నానుకదా? ఆశ్చర్యం. అవతలి వైపు సాక్షాత్ మంత్రిగారు.

"నిన్నగాక మొన్ననేకదండీ మీరొచ్చింది. అక్కడంతా సౌకర్యంగానే ఉందికదా? అక్కడే ఉండండి. ప్రస్తుతానికి చాలా బిజీగా ఉన్నాను. రెండు మూడు రోజుల్లో నేనే వచ్చి కలుస్తాను."

అదనులో పదవుల్ని తన్నుకొని అవసరంలో పెదవి విరిచే వాళ్ళు అతనిముందు మరుగుజ్జులైతే ఒక్క ఎగురు ఎగిరి ఎర్రకోట మీద నిలబడి జండా ఎగరేయాలన్నంత ఆనందం!!

ఎదురుచూడడం ఒక విచిత్రమైన స్థితి. ఒక అందమైన శిక్ష. అందమైన శిక్ష వయసుతో ముడిపడింది. అదే అది ఒక మంచితో ముడిపడిందంటే కాలం గడిచినట్లే తెలియదు. మరొక రెండురోజులు అలాతెలియకుండానే చల్లగా గడిచిపోయాయి. మంత్రిగారినుండి ఫోన్లో పలకరింపులేదు. వస్తాడన్న జాడ అసలే లేదు. అయినా ఆశ చెడ్డది. అదీ నమ్మకంతో ముడిపడింది. ఇప్పుడొస్తాడు. ఇక కొంతసేపటికొస్తాడు. అని ఎదురు చూస్తున్న సమయంలో సీతారాం రాయలసీమ నాటుబాంబులాంటి వార్త చెవుల్లో వేశాడు.

నడుస్తున్నప్పుడు ఉన్నట్లుండి ఒకకాలు పడిపోతే?- ఒక సత్కార్యానికి చేయూత ఇవ్వాలనుకొన్నప్పుడు ఒక చేయిపడిపోతే?- ఒక ముగ్ధమనోహర సౌందర్యంపై చూపు నిలిపినపుడు ఒక కన్ను చూపు కోల్పోతే?- అదీ ఆమాటతో నాపరిస్థితి.

"ఢిల్లీలో నా పన్లన్నీ అయిపోయాయి. రేపు సాయంకాలం రైలుకు రిజర్వేషన్ చేయిస్తున్నాను. మరి నీ సంగతి?" అన్నాడు.

కత్తివేటుకు మొగాన నెత్తురుచుక్కలేని నా పరిస్థితి. నా అవస్థను గమనించిన సీతారాం-

"చూడు మిత్రమా! రాజకీయ నాయకులకు ఇప్పుడు చెప్పిన మాట ఇంకొంతసేపటికి గుర్తుండదు. నిన్ను వెదుక్కొంటూ ఆయన ఇక్కడికి వస్తాడన్న మాట కల్ల. నీకా ఢిల్లీకి తూర్పు పడమరలు తెలియవు.. దీనికి తోడు భాషా సమస్య ఉండనే ఉంది. అందువల్ల నా మాట విను. రేపు సాయంకాలం ఐదు గంటలకే మనం బయలుదేరవలసిన రైలు. ఈ లోపుగా మంత్రిగారి కథ తేల్చుకో. ఆయన బంగళా ఎక్కడుందో తెలుసుకొన్నాను. రేపు ఉదయం ఆరుగంటలకు నిన్నా బంగళాముందు నిలబెట్టే పూచీనాది. ఆ గేటు ముందు మాటువెయ్. ఇంట్లో ఉంటే బయటికి రాకుండా పోడు. బయటికి వెళ్ళి ఉంటే ఇంటికి రాకుండా పోడు. ప్రస్తుత పరిస్థితిలో ఇంతకుమించిన దారి వేరే లేదు" అన్నాడు.

పచ్చినిజస్తనంలో శల్యపరీక్ష చేయలేను కదా?

నా మౌనం అతని ప్రయత్నానికి దోహదం చేసింది.

ఆ మరుసటి రోజు ఆరుగంటలకు నేను మంత్రిగారి బంగళా ముందు నిలబడ్డాను.

చంద్రగిరి కోటంత బంగళా... ఆ బంగళా ముందు అలిపిరి గేటంత గేటు... ఆ గేటుకీపక్క ఆ పక్క సెక్యూరిటీ గార్డులు... వాళ్ళచేతుల్లో తుపాకులు... కండ్లల్లో నిప్పులు... కాళ్ళల్లో బూట్లు... ఆ గేటు దరిదాపులకు పోవాలంటేనే గుండెల్లో దడపుడ్తూ ఉంది.

అయినా సాహసించాను. అడుగుమీద అడుగ్గా అదురుతూ బెదురుతూ ఆ గేట్‌ను సమీపించాను.

కావలి కాయమంటే చెవులు వాలేసి సేద దీర్చుకొంటున్న కుక్కలు అలికిడయ్యే కుందికి లేచినట్లు సెక్యూరిటీ గార్డుల చేతుల్లో తుపాకీలు నిటారుగా లేచి నిలబడ్డాయి- నేనేదో వాళ్ళమీద దాడి చేయడానికి వచ్చినట్లు!... నన్నొక శత్రువును చూసినట్లు ఉరిమురిమి చూస్తున్నారు. నేను కదిలీ మెదలకుండా నిలబడేసరికి ఒంటిమీద వాలబోతున్న పురుగునో బూచినో విదిలించి కొట్టినట్టు చేతి సైగలతోనే 'పోపో'! అంటూ విదిలించుకొట్టున్నారు.

అప్పుడు ప్రత్యక్షమయ్యాడు అక్కడొక దేవతా మనిషి!

పొడుగుకు తగ్గలావు. లావుకు తగ్గ పొడుగు. ఆ హొద్దూ పొడుగులతో తగినట్టు వేషధారణ. మనిషి పెద్ద మాంత్రికుడో తాంత్రికుడో అనిపిస్తున్నాడు. నోరు విప్పాడు. దేవతా మనిషి దేవభాషే మాట్లాడుతాడు అనుకొన్నాను. అయితే అతడు మాట్లాడింది తెలుగులో. నాకు కుతుబ్‌మినార్‌కు తెలుగు నేర్పినంత ఆనందమయింది.

ఎవరు మీరు?

చెప్పాను.

ఏవూరు?

చెప్పాను.

ఏంకావాలి?

చెప్పాను.

"ఓ మంత్రిగారినే కలుసుకోవాలా?" మాటల్లో చెప్పలేనంత వ్యంగ్యం.

"వారు నాకు తెలుసు"

"నాకు ప్రధానమంత్రిని కూడా తెలుసయ్యా!"

నా అరికాలిమంట ఉచ్చికెక్కింది.

అంటే ప్రధానమంత్రికి నన్ను తెలియాలికదా? అన్న ధ్వని. కాలే సమాధానం చెప్పాల్సిన పరిస్థితి. అయినా వసుదేవుడు గుర్తొచ్చాడు.

"ఆ ప్రాంతం నుండి వచ్చిన ప్రతి బడుద్దాయి ఇలాగే వాగుతాడు. ఆయన గెలవడానికి కారణం తానేనంటాడు. చివరికి తానే ఆయన. ఆయనే తాను. అనడానికి కూడా వెనకాడడు. ఛీఛీ! ఏం మనుషులో ఏం మనస్తత్వాలో?"

అమాంతంగా సెక్యూరిటీ గార్డు పైన బడి వాడిచేతిలో తుపాకీ లాక్కొని ఇష్టమొచ్చినట్లు నోరు పారేసుకొంటున్న వాడి తల పగలగొట్టడమో లేదా నా తలే కొట్టుకోవడమో చేయాలన్నంత కోపం వచ్చింది.

కొంపచెరుచుకోవడానికి కాదు గదా నేను ఇంత దూరం వచ్చింది. అందుకే కోపాన్ని దిగమింగుకొన్నాను. వాడి మొగం చూడడం కూడా ఇష్టం లేకుండా వెనక్కు తిరిగాను. బంగళాకు కొంతదూరంలో నిలబడ్డాను.

మంత్రిగారు నిద్రలేస్తారు. లేస్తూనే కనీసం కాలాడించడానికైనా ఆ ఆవరణలో అటూయిటూ పచార్లు చేస్తారు. అప్పుడైనా అతని కంట పడకుండా పోతామా? అన్న చిన్న నమ్మకం పెద్ద ఆశగా కాలం గడిచిపోతూ ఉంది.

గంట ఏడయింది. ఎనిమిదయింది. ముందుగానే గూని. తోడుకు మూర్ఛరోగం అన్నట్టు ఉన్నట్టుండి సన్నని తుంపర ప్రారంభమయింది. ఉదయాన వచ్చిన చుట్టం ఉదయాన వచ్చిన వాన ఉండరులే అనుకొంటూ ఉంటే అది కాస్త ఎక్కువయింది. లోపలికి వెళ్ళడానికి లేదు. చుట్టుపక్కల తలదాచుకోవడానికి తావులేదు. బాగా తడిసి పోయాను. తల చిందర వందరగా గూడులా తయారయింది. కాకిగూడులా ఉంది.

అదో అప్పుడుపడింది తలమీద ఫట్‌మన్న దెబ్బ!

ఉలిక్కిపడ్డాను. దరిదాపుల్లో మనుషులు ఎవరూ లేరే? తలమీద దెబ్బ ఎలా పడిందని దిక్కులు చూశాను. అల్లంతదూరంలో నిటారుగ పెరిగినచెట్టు. ఆచెట్టుమీద ఒకకాకిగూడు. గూటిలో కాకిపిల్లలు. ఆకాకి విడిచిన బాణంలా రివ్వున వచ్చి తలమీద ఒక తన్ను తన్ని మళ్ళీ గూటి పక్కన వాలుతూ ఉంది.

అప్పటి నాఅవతారం బహుశా కాకులపట్టే వాడిమాదిర దానికి తోచిఉండవచ్చు!

"కాకి నెత్తిన తన్నితే ఏల్నాటి శని పట్నిట్టేరా అబ్బోడా!" అని చిన్నప్పుడు మాయమ్మ చెప్పిన మాటలు మనసులో మెదిలాయి. అప్పటికే బాగా దెబ్బతిన్న మనసు. దెబ్బమీద దెబ్బ. మనస్సు వికలమయింది. అయినా చేసేది లేకుండా పట్టు వదలని విక్రమార్కుడిలా మంత్రి బంగళాముందు తడుస్తూ నిలబడ్డాను.

మళ్ళీ ఒకదెబ్బ తలమీద ఫట్‌మని పడింది.

కడుపు రగిలింది. కండ్లల్లో గిర్రున నీళ్ళు తిరిగాయి. గిరక్కున చెట్టు తట్టు తిరిగాను. ఆ చెట్టు దగ్గరికి నడిచాను. ఆ చెట్టుకింద నిలబడి తలపైకెత్తి రెండుచేతులు జోడించాను.

"నేను నీకు ఓటు వెయ్యలేదుగదా? మరి నన్నెందుకు తన్నుతున్నావే?" అని అడిగాను.

కొమ్మమీద కొలువుతీరి అదినన్ను ఉరిమురిమి చూస్తూఉంది.

దాని కోపానికి కారణం ఊహించుకోలేక బంగళావైపు తిరిగాను.

ఎప్పుడు గేటు తీశారో? ఎప్పుడు మంత్రిగారు కారెక్కారో? క్షణాల్లో జరిగిపోయినట్లుంది. నాలుగు బార్లకారు తారురోడ్డు మీద వయ్యారాలు పోతూ చడీ చప్పుడు లేకుండా ముందుకు దూసుకొనిపోతూ ఉంది.

సిద్ధాంతాలకు అపచారం కాకపోతే అప్పుడే కాకి తన్నాలా? తన్నితే తన్నిందిలే అనుకోని పరిస్థితుల దృష్ట్యా సమాధాన పడకుండా అప్పుడే చెట్టుకిందికి పోవాలా? ఏదో పెద్ద మేధావి అయినట్లు నాతెలివినంతా కాకిమీద చూపాలా? ఆ సందులో మంత్రిగారు తుర్రుమనాలా?

అంటే ఆ క్షణం నుంచే నన్ను ఏల్నాటిశని పట్టిందన్నమాట!

"నేను నీకేంవి ద్రోహం చేశాను?– నా మీద నీకెందుకింత కోపం? శనిపట్టిందంటే ఒక రాగాన వదల్దే? ఇక నాగతి ఏమవుతుందో నీకు తెలియదా?" అని అభ్యర్థన పూర్వకమైన చూపుల్ని విసిరాను. అది నా బాధను గ్రహించినట్లుంది.

"ఒరే పిచ్చోడా! కాకితన్నితే ఏల్నాటిశని పట్టుతుందని పిచ్చిది మీ అమ్మ వజతోకలిపి నూరిపోసింది. అది నీ నరనరాల్లో జీర్ణించుకొని పోయింది. మీ మెదళ్ళు అంతరిక్షాలకు ఎదిగినా ఈ మూఢనమ్మకాల మొదళ్ళకు మీరు నీళ్ళుపోసి పెంచుతూనే ఉన్నారు. అసలు విషయాన్ని నీవు గ్రహించలేకపోతున్నావ్. ఏనాడు నీవు నీ నిర్ణయాన్ని మార్చుకొని స్వార్థరాజకీయాలకు వత్తాసుపలికి ఓటు వేశావో? ఓట్లు వేయించావో ఆనాడే నీకు ఏల్నాటి శని పట్టింది! అది గ్రహించలేకుండా నామీదపడి మొత్తుకొంటున్నావ్!" అన్నట్లుగా ఏమో అది గోలగోలగా అరుస్తూ ఉంది.

దాని గోలలో అంతర్లీనమైన భావన నా గుండెల్ని తాకితే రెప్పార్పకుండా దాన్నే చూస్తున్నాను. అది నన్ను అర్థం చేసుకొన్నట్లుంది.

"ఒరే! మానవుడా! స్వార్థమే రూపుగొన్న దానవుడా!– సాటి మనిషి అభ్యర్థిస్తే ఎంతోకొంత సహాయం చేశావు. నిజమే. నీకూ నాకే కాదు ఇది లోకానికి తెలిసిన సత్యమే. అయితే అది స్వార్థంతో ముడిపడిందని లోకానికి తెలియదు. అనవసరంగా నాపై నిందమోపి ఎత్తి పొడుస్తున్నావ్. స్వార్థంతో ముడిపడిన సేవకు ప్రతిఫలం అందలేదని ఏడుస్తున్నావ్!

నేను కాకిని. మీ చేతి ఎంగిలి మెతుకుల్ని ఏరుకొని తిని బతికేదాన్ని. మీరు పితృ దేవతలకు పిండంపెడ్తే అది అర్హమైతేనే తినేదాన్ని. అదే నల్లకాకిలో దాగిన తెల్లగుణం.

అయితే నీ మనుషుల మనస్సులు అలా కాదే? సాటి మనుషులకు తానేమీ చేయకపోయినా తనకేమీ చేయలేదని ఏడ్చేవాళ్ళు ఉన్నారు. ప్రతిఫలాపేక్షతో ఇలా ప్రాకులాడుతూ నీవలె పరితపించేవాళ్ళూ ఉన్నారు.

మీరు మనుషులు!
నేను కాకిని!!
నా జన్మ నిస్వార్థమైన సామాజిక సేవతో ధన్యమైంది.
ఎవరు గుర్తిస్తున్నారు? ఎవరు గౌరవిస్తున్నారు?
ఈ కాకి శోకం! ఎవరిది? నీదా? నాదా?
దాని చూపులు గుచ్చిగుచ్చి నన్ను అడుగుతున్నట్లుంది. ఏమని చెప్పను?

"ఇప్పుడేకాదు. ఎప్పుడూ స్వార్థం పాదాలకు ప్రణమిల్లే మనిషి చెప్పడు. చెప్పలేడురా!" అని గోలగోలగా అరుస్తూ ఉంది.

లోకం దృష్టికి అది గోలగా అనిపించవచ్చు. కాదు. అది కాకి గోలకాదు! కాకి శోకం! ●

ఆహ్వానం
(1, నవంబర్ 1994)